


# మళ్లీ బాంబుల మోత

- రెండోరోజు బరితెగించిన పాక్
- జమ్మూ,సాంబ, పఠాన్‌కోట్, ఫిరోజ్‌పూర్‌లపైకి డ్రోన్లు
- ఫిరోజ్‌పూర్‌లో పౌరులకూ గాయాలు

(ప్రభాత సమాచారం, న్యూస్ డెస్క్)



పాకిస్థాన్ మరోసారి కవ్వింపు చర్యలకు దిగింది. జమ్మూ, సాంబా, పఠాన్‌కోట్‌లతో పాటు పంజాబ్‌లోని అమృత్‌సర్, ఫిరోజ్‌పూర్, హోష్టియార్‌పూర్, గురుదాస్‌పూర్, తర్న్ తరణ్ లక్ష్యంగా డ్రోన్ దాడులకు తెగబడింది. అయితే, దాయాది డ్రోన్ దాడుల్ని భారత సైన్యం దీటుగా తిప్పికొడుతోంది. ఫిరోజ్‌పూర్‌లోకి వచ్చిన డ్రోన్లు మాత్రం కొన్ని జనావాసాలపై పడడంతో కొంత మంది పౌరులు గాయపడ్డట్టు తెలుస్తోంది. సరిహద్దు నుంచి మన దేశం వైపునకు దూసుకొచ్చిన 100 వరకు డ్రోన్లను ఎయిర్ డిఫెన్స్ సాయంతో భారత సైన్యం కూల్చివేసింది. జమ్మూ నగరం వ్యాప్తంగా సైరన్లు మోగాయి. తనకూ పేలుళ్ల శబ్దాలు వినిపించాయని జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. జమ్మూ, పరిసర ప్రాంత ప్రజలు వీధుల్లోకి రావొద్దని, ఇళ్లకే పరిమితం కావాలని ఆయన సూచించారు. వదంతులను పట్టించుకోవద్దని, ఆధారాలు లేని, ధ్రువీకరించని సమాచారాన్ని వ్యాప్తి చేయొద్దని పిలుపునిచ్చారు. మరోవైపు, నియంత్రణ రేఖ వెంబడి పాక్ రేంజర్లు భారీగా కాల్పులకు తెగబడ్డారు.ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా దేశంలోనిపలు ప్రాంతాల్లో బ్లాక్‌అవుట్ ప్రకటించారు. జమ్మూ డివిజన్ ఉధంపూర్‌లో పూర్తిగా బ్లాక్ అవుట్ పాటించారు. ఆ ప్రాంతంలో భారీగా సైరన్ శబ్దాలు మోగాయి. జమ్మూ, అఖ్నూర్, జైసల్మేర్, హరియాణాలోని అంబాలా, పంచకుల, పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ సహా అనేక సరిహద్దు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఫిరోజ్‌పూర్‌లోని నివాస ప్రాంతంపై పాక్ జరిపిన డ్రోన్ దాడిలో పలువురికి గాయాలైనట్లు తెలుస్తోంది. దీంతో వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. శుక్రవారం ఉదయం భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించిన ఏడుగురు ఉగ్రవాదుదలను భారత సైన్యం కాల్చి చంపింది.

**400 డ్రోన్‌లతో దాడి..**

జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్‌లోని 36 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని 300 నుంచి 400 డ్రోన్లతో పాక్ గురువారం దాడులకు పాల్పడినట్లు భారత సైన్యం తెలిపింది. పాకిస్థాన్ తన పౌర విమానాలను రక్షణ కవచాలుగా ఉపయోగిస్తోందని వెల్లడించింది. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ.. కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లతో కలిసి విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. భారత గగనతల రక్షణ వ్యవస్థలను పరీక్షించడం, నిఘా సమాచార సేకరణే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయని తెలిపారు. ప్రాథమిక నివేదికల ప్రకారం తుర్కియేకు చెందిన 'అసిస్‌గార్డ్ సోంగర్' డ్రోన్లను ప్రయోగించినట్లు తెలిసిందన్నారు.

'గురువారం రాత్రి రెచ్చగొట్టే చర్యలకు దిగిన పాకిస్థాన్.. నియంత్రణ రేఖ వెంట ఉల్లంఘనకు పాల్పడుతూ దాడులకు తెగబడింది. భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేసింది. పాకిస్థాన్‌నుంచి 300నుంచి 400 డ్రోన్లవరకు వచ్చాయి. వీటిలో అనేక డ్రోన్లను కూల్చేశాం. పంజాబ్ సరిహద్దుల్లో పూర్తి అప్రమత్తంగా ఉన్నాం. ఈ దాడుల్లో అనేకమంది గాయపడ్డారు. పాక్ దాడులను భారత వాయుసేన సమర్థంగా అడ్డుకుంది. ప్రార్థనా మందిరాలే లక్ష్యంగా పాక్ దాడులు చేస్తోంది. ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించేందుకు పాక్ ప్రయత్నిస్తోంది. పాకిస్థాన్ డ్రోన్, క్షిపణి దాడులు మొదలుపెట్టినప్పటికీ.. అక్కడి పౌర విమానాలకు గగనతలాన్ని మూసివేయలేదు. కరాచీ, లాహోర్ మధ్య విమాన సర్వీసులు నడుస్తూనే ఉన్నాయి. తమ దాడులకు భారత్ నుంచి ప్రతిస్పందన ఉంటుందని తెలిసీ పౌర విమానాలను పాకిస్థాన్ రక్షణ కవచంగా వాడుకుంటోంది. ఇది భారత్‌పాక్ మధ్య అంతర్జాతీయ సరిహద్దు సమీపంలో వెళ్లే విమానాలతోపాటు అక్కడి పౌర విమానాలకు సురక్షితం కాదు. అంతర్జాతీయ విమానాలను దృష్టిలో ఉంచుకొని భారత వాయుసేన పూర్తి సంయమనంగా వ్యవహరించిందని రక్షణశాఖ ప్రతినిధులు కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు వెల్లడించారు.



**ఢిల్లీలో హైఅలర్ట్..**

భారత్‌పై పాకిస్తాన్ డ్రోన్‌ల దాడికి తెగబడడంతో రెండు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు తారాస్థాయికి వెళ్లాయి. ఈ నేపథ్యంలో ఏదైనా అత్యవసర పరిస్థితులను తలెత్తితే వాటిని ఎదుర్కొనేందుకు అన్ని రాష్ట్రాలు అప్రమత్తమవుతున్నాయి. పాక్ సరిహద్దు రాష్ట్రాలైన పంజాబ్, రాజస్థాన్, గుజరాత్ రాత్రి కరెంటు కట్, స్కూళ్ల మూసివేత, ఉద్యోగులకు సెలవులు రద్దు వంటి చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో భారీ సంఖ్యలో బలగాలను మోహరించడం, కంట్రోల్ రూమ్‌లు, అనేక ప్రాంతాల్లో ఎయిర్ సైరన్ల ఏర్పాటు, మాక్ డ్రిల్స్ నిర్వహించడంలో రాజధాని ఢిల్లీ యంత్రాంగం నిమగ్నమైంది. రాజధానిలోని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు కీలక స్థావరాల్లో భారీ భద్రతను ఏర్పాటు చేశారు. రద్దీగా ఉండే మార్కెట్లు, రైల్వే స్టేషన్లు, మాల్స్, పార్కులు, మెట్రో స్టేషన్లలో నిఘాను పెంచారు. ఎటువంటి పరిస్థితులనైనా సమర్థంగా ఎదుర్కొనేందుకు వీలుగా 11 జిల్లాలను సంసిద్ధం చేస్తున్నారు. వీటితోపాటు నగర వ్యాప్తంగా ప్రజలను అప్రమత్తం చేసేందుకు వీలుగా సైరన్లను ఏర్పాటు చేసే పనిలో పడ్డారు. 'సైరన్లను అమర్చుతున్నాం. ఎత్తైన భవనాలపై ఏర్పాటు చేసి, వీటి పనితీరును పరిశీలిస్తున్నాం. రానున్న రోజుల్లో మరిన్ని ప్రదేశాల్లో ఏర్పాటు చేయనున్నాం. 11 జిల్లాల పరిధిలో ఇప్పటివరకు 10 సైరన్లు ఏర్పాటు చేశాం. కొన్ని సైరన్ శబ్దాలు రెండు కి.మీలు, కొన్ని నాలుగు, మరికొన్ని 16 కి.మీ పరిధి వరకు వినిపిస్తాయి' అని ఢిల్లీ రెవెన్యూ అధికారులు వెల్లడించారు. వీటికి సంబంధించి జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఇవి శబ్దం చేసినప్పుడు ఎలా స్పందించాలనే విషయంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. భారత్‌లోని సరిహద్దు జిల్లాలపై పాకిస్థాన్ డ్రోన్, క్షిపణి దాడులకు పాల్పడిన సంగతి తెలిసిందే.

### స్టేడియానికి బాంబు బెదిరింపు

ఉద్రిక్తల నేపథ్యంలో ఢిల్లీ, హైదరాబాద్‌లో బాంబులు పెట్టినట్లు ఫోన్లు చేసి కొంతమంది హెచ్చరించారు. దీంతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. తాజాగా ఢిల్లీలోని ఓ స్టేడియం, హైదరాబాద్ విమానాశ్రయంలో బాంబులు పెట్టినట్లు కాల్స్ వచ్చాయి. ఢిల్లీ, డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్‌కు బాంబు బెదిరింపు కాల్స్ రావడంతో బాంబు డిస్పోజల్ స్క్వాడ్ డాగ్ స్క్వాడ్ బృందాలు, ఢిల్లీ పోలీసు బృందాలు అరుణ్ జైట్లీ స్టేడియానికి చేరుకున్నాయి. అది బూటకమని తేలిందని డీడీసీఏ కార్యదర్శి అశోక్ శర్మ తెలిపారు. తమకు డీడీసీఏ చిరునామాకు ఇమెయిల్ ద్వారా బాంబు బెదిరింపు ఫోన్ వచ్చిందని చెప్పారు. ఆ మెయిల్‌ను వెంటనే ఢిల్లీ పోలీసులకు పంపించామని తెలిపారు. ఢిల్లీ పోలీసు బాంబు స్క్వాడ్ వచ్చి మొత్తం స్టేడియాన్ని తనిఖీ చేసిందని వివరించారు. బాంబులను ఏం గుర్తించలేదని డీడీసీఏ కార్యదర్శి అశోక్ శర్మ తెలిపారు. ఈ విషయం తెలియడంతో వెంటనే స్క్వాడ్ బృందాలను స్టేడియానికి తరలించామని, ఆ ప్రదేశాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశామని ఢిల్లీ పోలీసు వర్గాలు తెలిపాయి. స్టేడియంలో అనుమానాస్పదంగా ఏమీ కనిపించలేదని అన్నారు. ఇంకా, స్టేడియం లోపల, చుట్టుపక్కల భద్రతను పెంచామని ఢిల్లీ పోలీసు వర్గాలు తెలిపాయి.

## పాశుపతాలు











### 36 ప్రాంతాల్లో 400 డ్రోన్లతో పాక్ దుశ్చర్య భారత్

భారత్‌లోని సరిహద్దు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని గురువారం రాత్రి పాకిస్థాన్ డ్రోన్ దాడులకు తెగబడిన సంగతి తెలిసిందే. జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్‌లోని 36 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని 300 నుంచి 400 డ్రోన్లతో పాక్ ఈ దాడులకు పాల్పడినట్లు భారత సైన్యం తెలిపింది. పాకిస్థాన్ తన పౌర విమానాలను రక్షణ కవచాలుగా ఉపయోగిస్తోందని వెల్లడించింది. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ.. కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లతో కలిసి విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. భారత గగనతల రక్షణ వ్యవస్థలను పరీక్షించడం, నిఘా సమాచార సేకరణే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయని తెలిపారు. ప్రాథమిక నివేదికల ప్రకారం తుర్కియేకు చెందిన 'అసిస్‌గార్డ్ సోంగర్' డ్రోన్లను ప్రయోగించినట్లు తెలిసిందన్నారు.

## మా ప్రధాని పిరికివాడు..
# పాకిస్థాన్ ఎంపీ ఫైర్

భారత్‌పాకిస్థాన్ మధ్య యుద్ధ పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. గురువారం రాత్రి జమ్మూతో పాటు రాజస్థాన్, పంజాబ్ సరిహద్దుల్లో డ్రోన్లు, మిసైళ్లతో దాడులకు యత్నించింది. కానీ మన భారత సైన్యం ఈ దాడులను తిప్పికొట్టింది. పాక్ ప్రయోగించిన మిసైళ్లు, డ్రోన్లు, ఫైటర్ జెట్లను కూల్చివేసింది. ఆ తర్వాత పాకిస్థాన్‌లోని లాహోర్‌తో పాటు పలు ప్రాంతాల్లో దాడులకు దిగింది. దీంతో ప్రస్తుతం భారత్‌పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. మళ్లీ భారత్ పాక్‌పై దాడులు చేయొచ్చనే ప్రచారం నడుస్తోంది. ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతోందని ఇప్పటికే రక్షణశాఖ ప్రకటించింది.

అయితే ప్రస్తుతం పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్‌కు నిరసన సెగ తగులుతోంది. ఆ దేశ రాజకీయ నేతలే ఆయనపై తీవ్రంగా విమర్శలు చేస్తున్నారు. గురువారం ఓ పాకిస్థాన్ ఎంపీ పార్లమెంటులో మాట్లాడుతూ షెహబాద్ షరీఫ్ పిరికివాడంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేరాకాదు ఈ ఎంపీ అప్పట్లో మైసూర్ రాజైన టిప్పు సుల్తాన్





చెప్పిన సూక్తిని కూడా ప్రస్తావించారు. '' ఒక సమూహానికి పులి నాయకత్వం వహిస్తుందంటే ఆ సమూహంలో ఉన్న పిరికివాళ్లు కూడా పులిలాగే పోరాడుతారు. కానీ పులులు ఉన్న గ్రూప్‌కు పిరికివాడు నాయకత్వం వహిస్తే.. ఆ గ్రూప్‌లో ఉండే పులులు కూడా పిరికివాడిలా పోరాడుతాయని'' అన్నారు. దేశంకోసం పోరాడుతున్న పాకిస్థాన్ సైనికులు తమ నాయకుడు (షెహబాద్ షరీఫ్) ధైర్యంగా పోరాడాని అనుకుంటున్నారు. కనీసం భారత ప్రధాని నరేంద్ర మోదీ పేరు కూడా చెప్పలేని పిరికి నాయకుడు ఉంటే.. సరిహద్దుల్లో పోరాడుతున్న పాక్ సైనికులకు ఎలాంటి సందేశం ఇస్తున్నట్లు అని'' ఆ ఎంపీ ధ్వజమెత్తారు.

## పార్లమెంటులో నవ్వులపాలైన పాకిస్థాన్ రక్షణశాఖ మంత్రి..

ఆపరేషన్ సింధూర్ తర్వాత పాకిస్థాన్ భారత్‌పై డ్రోన్లు, మిసైళ్లతో దాడులకు యత్నించింది. వీటిని మన ఇండియన్ ఆర్మీ తిప్పికొట్టింది. ఆ తర్వాత ఇస్లామాబాద్, లాహోర్, సియోల్ కోట, బహల్‌వాల్‌పూర్‌పై మెరుపు దాడులు చేసింది. అయితే గురువారం పాకిస్థాన్ రక్షణశాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ పార్లమెంటులో ఓ ప్రకటన చేసి నవ్వులపాలయ్యారు. భారత్ జరిపిన డ్రోన్ దాడులపై ఆయన మాట్లాడారు. '' నిన్న జరిగిన భారత్ డ్రోన్ దాడి మన స్థావరాలు తెలుసుకునేందుకే చేశారు. వాటి గురించి భారత ఆర్మీకి తెలియకుండా ఉండేందుకే వాటిని అడ్డుకోలేదని'' అన్నారు. దీంతో ఈ ప్రకటనతో ఆయన నవ్వులపాలయ్యారు.

ఇక ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్ పరిస్థితులు మరింత దిగజారిపోయాయి. ఇప్పటికే ఆ దేశ స్టాక్ మార్కెట్ కుప్పకూలపోయింది. గురువారం రాత్రి పాక్.. జమ్మూ, పంజాబ్, రాజస్థాన్‌లోని పలు ప్రాంతాలపై డ్రోన్లు, మిసైళ్లు, ఫైటర్ జెట్లతో దాడులకు యత్నించింది. కానీ వీటన్నింటిని భారత సైన్యం భగ్నం చేసింది. ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను యాక్టివేట్ చేసి వాటిని నేలకూల్చింది. మరోవైపు భారత్‌పై ప్రయోగించిన డ్రోన్ దాడుల్లో పాకిస్థాన్ టర్కీ సాయం తీసుకున్నట్లు తెలుస్తోంది. టర్కీ పంపించిన డ్రోన్లనే భారత్‌పై ప్రయోగించినట్లు సమాచారం. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో పాకిస్థాన్ ప్రధాన మంత్రి



షెహబాజ్ షరీఫ్‌కు నిరసన సెగ తగులుతోంది. ఆ దేశ రాజకీయ నేతలే ఆయనపై తీవ్రంగా విమర్శలు చేస్తున్నారు. గురువారం ఓ పాకిస్థాన్ ఎంపీ పార్లమెంటులో మాట్లాడుతూ షెహబాద్ షరీఫ్ పిరికివాడంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేరాకాదు ఈ ఎంపీ అప్పట్లో మైసూర్ రాజైన టిప్పు సుల్తాన్ చెప్పిన సూక్తిని కూడా ప్రస్తావించారు. '' ఒక సమూహానికి పులి నాయకత్వం వహిస్తుందంటే ఆ సమూహంలో ఉన్న పిరికివాళ్లు కూడా పులిలాగే పోరాడుతారు. కానీ పులులు ఉన్న గ్రూప్‌కు పిరికివాడు నాయకత్వం వహిస్తే.. ఆ గ్రూప్‌లో ఉండే పులులు కూడా పిరికివాడిలా పోరాడుతాయని'' అన్నారు.